క్లుప్తంగా

నేడు జాతీయ లోక్ అదాలత్

యలమంచిలి రూరల్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం యలమంచిలి న్యాయస్థానాల ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సేవాధికార చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి యలమంచిలి కోర్టుల్లో నిర్వహిస్తున్న ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, వాహన ప్రమాద క్లెయిమ్‌లు, అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు తమ న్యాయవాదులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నిర్వహించిన మూడు లోక్ అదాలత్‌ల్లో మొత్తం 583 కేసులు పరిష్కారమయ్యాయి. శనివారం 4వ లోక్ అదాలత్ జరగనుంది.

ప్రశాంత పోలింగ్ నిర్వహణకు కృషి



ఎన్నికకు సంబంధించి సామగ్రి పరిశీలిస్తున్న నీటి పారుదల శాఖ ఏఈ వినయ్

మునగపాక: మండల వ్యాప్తంగా శనివారం నిర్వహించే సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు నీటి పారుదల శాఖ ఏఈ వినయ్ తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికకు సంబంధించిన సామగ్రిని పోలింగ్ కేంద్రానికి తరలించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 11 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఎన్నికకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రైతులు కూడా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు.

పాయకరావుపేట మండలంలో 7 పోలింగ్ కేంద్రాలు

పాయకరావుపేట: మండలంలో శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు 7 గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు నీటి పారుదల శాఖ ఏఈ కె.శ్రీరామమూర్తి తెలిపారు. భూమి చానల్ పరిధిలోని రైతులకు నామవరం ప్రాథమిక పాఠశాల, మూతా చానల్ పరిధిలోని రైతులకు ఎస్.నర్సాపురం జెడ్పీ హైస్కూల్, మంగవరం చానల్ పరిధిలోని రైతులకు మంగవరం జెడ్పీ హైస్కూల్, ఆవ చానల్ పరిధిలో రైతులకు గోపాలపట్నం ప్రాథమిక పాఠశాల, మాసాహేబుపేట చానల్ పరిధిలో రైతులకు మాసాహేబుపేట ప్రాథమిక పాఠశాల, రాజవరం చానల్ పరిధిలో రైతులకు రాజవరం గ్రామ సచివాలయం, కనుమల చెరువు పరిధిలో రైతులకు పాల్తేరు ఎలిమెంటరీ పాఠశాల, పాల్తేరు గ్రామ సచివాలయంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నాగులాపల్లిలో నేడు గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో శనివారం గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా డిసెంబర్ నెలలో పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ఈ ఏడాది కూడా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సాయంత్రం 4 గంటలకు గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు, రాత్రికి గ్రామంలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి(యలమంచిలి): నిర్వహణ పనుల్లో భాగంగా రాంబిల్లి మండలంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాంబిల్లి, వాడపాలెం, కొత్తపేట, కొప్పుగొండుపాలెం, గోవిందపాలెం, చినకలవలాపల్లి, పెదకలవలాపల్లి, వైలోవ, వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన రేపు

పాయకరావుపేట: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ పొదుపు వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు. డిస్కమ్‌ల ద్వారా శక్తి సంరక్షణ, శక్తి సామర్థ్య కార్యకలాపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తామన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం





నీటి సంఘాల ఎన్నికల కోసం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయానికి చేరిన సామగ్రి

- పాయకరావుపేట నియోజకవర్గంలో 48, యలమంచిలి నియోజకవర్గంలో 39 సంఘాలకు నేడే ఎన్నికలు
- పోలీసు బందోబస్తు నడుమ ఎన్నిక నిర్వహణ



యలమంచిలి నీటి పారుదల కార్యాలయంలో ఎన్నిక సామగ్రితో బయలుదేరుతున్న సిబ్బంది

నక్కపల్లి: నీటి వినియోగదారుల సంఘాల(వాటర్ యూజర్ బాడీ) ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. చాలా చోట్ల ఈ ఎన్నికలు ఏకపక్షంగా నిర్వహించేందుకు కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. 100 ఎకరాలు అయకట్టు పైబడి కలిగిన మేజర్ అండ్ మైనర్ ఇరిగేషన్ చెరువులు, రిజర్వాయర్లకు ప్రాదేశిక సభ్యులను ఎన్నుకునేందుకు ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క నీటి సంఘానికి ఆరుగురు డైరెక్టర్ల(ప్రాదేశిక సభ్యులు)ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ ఆరుగురు సభ్యుల్లో ఒకరు చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. అధికారిక లెక్కల ప్రకారం పాయకరావుపేట నియోజకవర్గంలో మొత్తం 48, యలమంచిలి నియోజకవర్గంలో 39 నీటి వినియోగదారుల సంఘాలున్నాయి. ముఖ్యంగా గొడిచర్ల, ఉద్దండపురంలలో ఆయకట్టు 200 ఎకరాలు పైబడి ఉన్న మూడు చెరువులకు సంబంధించి నీటి సంఘాలను కైవసం చేసుకునేందుకు ఆశావహులు వ్యూహరచన చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఏకగ్రీంగా నీటి సంఘాలను ఎన్నుకునేందుకు ఆయకట్టు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉదయం 8 నుంచి ప్రక్రియ ప్రారంభం

అధికారులు మాత్రం ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన సామగ్రి అంతా సిద్ధం చేశారు. శనివారం ఉదయం ప్రారంభమయ్యే ఎన్నికల ప్రక్రియకు అవసరమైన ఓటర్ల జాబితాలు, ఇతర సామగ్రి శుక్రవారం మధ్యాహ్నానికి నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. శనివారం ఉదయం 8 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ముందుగా ప్రాదేశిక సభ్యుడిగా పోటీ చేసే రైతులు నామినేషన్ల ప్రక్రియ నిర్వహిస్తారు. టీసీ మెంబరుకు అదే సెగ్మెంట్‌లో మరో రైతు ప్రతిపాదించాల్సి ఉంటుంది. ఇలా ఒక సంఘంలో ఆరుగురు ప్రాదేశిక సభ్యుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత పోటీలో ఉన్న వారి పేర్లు నోటీసు బోర్డులో సీరియల్ నెంబర్లు వేసి అతికిస్తారు. ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన రైతుకు వివరాలతో కూడిన స్లిప్పులు అందజేస్తారు. వీటినే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉపయోగించాలి. రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తారు. వీటి కోసం ప్రత్యేకంగా బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీసీ సభ్యులు ఎన్నిక జరుగుతుంది. మధ్యాహ్నం ఎన్నికైన సభ్యుల్లో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకునే ప్రక్రియ చేపడతారు. తదుపరి డిక్లరేషన్‌లు, తొలి సమావేశం వంటి ప్రక్రియ పూర్తి చేస్తారు. ఎన్నికల నిర్వహణకు గాను మండల స్థాయి, గెజిటెడ్ హోదా కలిగిన వారిని పీవోలు, ఏపీవోలుగా నియమించారు. ఒక్కొక్క సంఘం ఎన్నికల నిర్వహణకు పీవో, ఏపీవో మరో నలుగురు పోలింగ్ సిబ్బందిని నియమించారు. వీరంతా శనివారం ఉదయానికి ఆయా గ్రామాలకు చేరుకుంటారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

పాయకరావుపేట నియోజకవర్గంలో..	
మండలం	ఎన్నికల జరిగే సంఘాలు
పాయకరావుపేట	7
కోటవురట్ల	7
ఎస్.రాయవరం	19
నక్కపల్లి	15
యలమంచిలి నియోజకవర్గంలో..	
మునగపాక	11
రాంబిల్లి	13
అచ్యుతాపురం	04
యలమంచిలి	11

ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు



శనివారం జరిగే నీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎన్నికల సామగ్రి సిద్ధం చేశాం. శనివారం ఉదయం సిబ్బంది ఎన్నికలు జరిగే గ్రామాలకు తరలివెళ్తారు. నియోజకవర్గంలో మొత్తం 48 సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నాం. ఏకగ్రీవంగా ఎన్నికలు జరగడానికి ప్రయత్నిస్తున్నాం. కానిపక్షంలో రహస్య బాలెట్ విధానంలో ఎన్నిక జరుగుతుంది.

– జగదీశ్వరరావు, డీఈ, ఇరిగేషన్ శాఖ

రూ.8 కోట్ల పరదేశమ్మ మాన్యాన్ని కాపాడండి

- 4.27 ఎకరాల ఆలయ భూమిపై రియల్టర్లు, కూటమి నేతల కన్ను
- ప్లాట్లు వేసి విక్రయించడానికి యత్నం
- రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేసిన ఆలయ కమిటీ సభ్యులు



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పరదేశమ్మ ఆలయ కమిటీ సభ్యులు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి ఎర్రవరంలో కొలువుదీరిన పరదేశమ్మ అమ్మవారి ఆలయ మాన్యాన్ని కొందరు రియల్టర్లు, కూటమి నేతలు కబ్జా చేసి, ప్లాట్లు వేసి అమ్మడానికి యత్నిస్తున్నారంటూ ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఎర్రవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎర్రవరం గ్రామం ఖాతా నంబరు 945, సర్వే నంబరు 171/2లో 4.27 ఎకరాల విస్తీర్ణంలో అచ్యుతాపురం బైపాస్ రోడ్డుకు ఆనుకుని పరదేశమ్మ ఆలయానికి చెందిన భూమి ఉంది. ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం సుమారు రూ.8 కోట్ల పైనే ఉంటుంది. ఈ భూమిని ప్లాట్లుగా చేసి అమ్ముకునేందుకు కూటమి నేతలు, కొందరు రియల్టర్లు ప్రణాళిక రూపొందించినట్టు తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం వన్ బీ ఖాతా, పట్టాదారు అడంగలు ప్రకారం భూమి పరదేశమ్మ పేరుతో ఉందన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో ఎర్రవరం వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి, పిట్టా నాగేశ్వరావు, జి.శ్రీరాములు, ఎస్.తులసీరాం, జి.సత్తిబాబు, తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సుకు 14 అర్జీలు

పాయకరావుపేట: మండలంలోని సత్యవరం గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు రైతుల వద్ద నుంచి 14 అర్జీలు అందినట్టు ఆర్ఐ త్రినాథ్ తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి రైతుల రికార్డులను పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని ఆర్ఐ చెప్పారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కొత్తపేటలో చెరువు పరిసరాలు శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

యలమంచిలి రూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ బీజీఎస్ ప్రసాదరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శుక్రవారం యలమంచిలి పట్టణం కొత్తపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం పక్కనున్న చెరువు, వాకింగ్ ట్రాక్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వారాంతంలో ఒక ప్రాంతంలో స్వచ్ఛత కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి, వార్డు సభ్యుడు మజ్జి రామకృష్ణ, పిల్లా త్రినాథరావు, మున్సిపల్ మేనేజర్ కె.విజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, పురపాలక సంఘంలో వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

తోటాడలో స్వచ్ఛతా హీ సేవ

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తోటాడ పంచాయతీలో శుక్రవారం పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రత్యేక బుట్టల్లో వేయాలన్నారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని, ఇందు కోసం తడి, పొడి చెత్త సేకరణ విషయంలో ప్రజలు సహకరించాలన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, పెద్దలు దొడ్డి రమేష్, మురళి, పలు శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణత లక్ష్యం



కోటవురట్లలో అభ్యసన సామర్థ్యాలు పరీక్షిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

కోటవురట్ల: పదో తరగతి పరీక్ష ఫలితాలలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డీఈవో అప్పారావు ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

నక్కపల్లి: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని ఎంఈవోలు కుంచం నరేష్, వేమగిరి నూకరాజు సూచించారు. శుక్రవారం వారు పెద బోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అన్ని సబ్జెక్టులలో విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేలా స్వయంగా ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సెలవు రోజుల్లో నిర్వహించే తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు హోలిస్టిక్ కార్డులను ఇచ్చారో? లేదో? అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, పాల్గుణరావు, ఎ.వి.ఎల్.కుమారి, చిన్నారావు, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రైతు ధర్నాకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



అడ్డురోడ్డు జంక్షన్ నుంచి అనకాపల్లి ధర్నాకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు



పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

ఎస్.రాయవరం: రైతుల సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం అనకాపల్లిలో జరిగిన ధర్నాకు పాయకరావుపేట నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో నాలుగు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బయలుదేరి వెళ్లారు. అడ్డురోడ్డు జంక్షన్ నుంచి పలు వాహనాల్లో వీరంతా అనకాపల్లి వెళ్లారు. ఈ సందర్భంగా సమన్వయకర్త కంబాల జోగులు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఇవ్వలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదన్నారు. అనకాపల్లి తరలి వెళ్లిన వారిలో ఎస్.రాయవరం ఎంపీపీ కోన లోవలక్ష్మి, పాయకరావుపేట, నక్కపల్లి మండల శాఖ అధ్యక్షులు చిక్కాల రామారావు, శీరం నర్సింహమూర్తి, జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ నాయకులు రాజేష్ ఖన్నా, జగతా శ్రీను, లొడగల చంద్రరావు, నూకినాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నీలేంద్రరావు, తదితరులు ఉన్నారు.

ఎన్నికల ముందు హామీలకు తిలోదకాలు

మునగపాక: ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు విస్మరించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ విమర్శించారు. రైతు పోరుబాటకు ఆయన రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి అనకాపల్లి కలెక్టరేట్‌కు శుక్రవారం బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడులకు సకాలంలో ప్రభుత్వం సాయం అందించకపోవడం విచారకరమన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు ఇస్తామంటూ రైతులను మోసగించిన ప్రభుత్వంపై రానున్న రోజుల్లో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా సేవలందించారన్నారు. రైతుల కోసం ఆలోచన చేసిన నాయకుడు జగన్ ఒక్కరే అన్నారు. పార్టీ నాయకులు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, దొడ్డి వరహా, దొడ్డి బుజ్జి, శరగడం జగన్నాథరావు, దిమ్మల అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, గుంట్ల అప్పారావు, రామజోగినాయుడు, భూలేక, పరమేష్, రామ్మోహనరావు, ఆడారి కాశీబాబు, పెంటకోట సత్యనారాయణ, ఈత బాబూరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మం పరిరక్షణకు కృషి

మునగపాక: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు పాటుపడాలని ఆధ్యాత్మిక కార్యకర్త పెతకంశెట్టి రామజోగినాయుడు కోరారు. మండలంలోని వాడ్రాపల్లి రామాలయం వద్ద 108 శ్రీరామ నామాలతో కూడిన కార్డులను ఆయన చిన్నారులతో కలిసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిభావాలు పెంచేందుకు శ్రీరామ నామాలు రాసేందుకు వీలుగా ఉండేలా కార్డులు అందజేశామన్నారు. ఈ కార్డులను అయోధ్యలోని రామాలయంలో సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లీలా భాస్కరరావు, నాగరాజు, శ్రీను, భవాని, పద్మ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి వినియోగిస్తున్న ఇద్దరిపై కేసు

మునగపాక: గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. నాగులాపల్లికి చెందిన ఒకరు, మునగపాకకు చెందిన మరొకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా గంజాయి తాగుతున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గ్రామాభివృద్ధికి లక్ష్యాలు నిర్ణయించుకోవాలి



మాట్లాడుతున్న డీడీ రామనాథం

నక్కపల్లి: గ్రామాభివృద్ధి కోసం చేపట్టే పనులకు సంబంధించి లక్ష్యాలు నిర్ణయించుకుంటే సత్ఫలితాలు వస్తాయని ఏపీ రూరల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ జె.రామనాథం తెలిపారు. పంచాయతీల నుంచి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై శుక్రవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి రోజు జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ముందుగానే లక్ష్యాలను నిర్ణయించుకోవాలన్నారు. నిధులు సద్వినియోగం చేసుకోవడానికి, గ్రామాలకు అవసరమైన అభివృద్ధి చేసే అవకాశం ఏర్పడుతుందన్నారు. చేసే పనుల్లో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలన్నారు. తొలి రెండు రోజులు ప్రభుత్వ శాఖల సిబ్బందికి శిక్షణ ఇస్తామని, 16, 17 తేదీల్లో సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వర్మ, జిల్లా శిక్షణా కేంద్రం మేనేజర్ చిన్నారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగభూషణం, ఐకేపీ ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో సుస్థిరాభివృద్ధి



కోటవురట్లలో శిక్షణ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న సభ్యులు

కోటవురట్ల: పంచాయతీల సుస్థిరాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని మండల పరిషత్ ఏవో చంద్రశేఖర్ కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కావలసిన వనరులను గుర్తించి ప్రణాళిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రసాద్, ఎంపీహెచ్ఈవో గోవిందరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంపోలు పాఠశాలలో బ్యాగులు, పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందిస్తున్న వెంకటేష్ అభిమానులు

మునగపాక: సినీహీరో వెంకటేష్ జన్మదినం సందర్భంగా మండలంలోని ఒంపోలు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏపీ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు పాలమరిశెట్టి చందు ఆధ్వర్యంలో బ్యాగ్‌లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు గాజువాక రాజు, లాయర్ శ్రీను, కొంగా నాగేశ్వరరావు, రోషన్‌కుమార్, పీఎంసీ చైర్మన్ ఉల్లింగల ఆదిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- అచ్యుతాపురంలో సీపీఎం ఆందోళన
- విద్యుత్ బిల్లుల దహనం



అచ్యుతాపురం జంక్షన్‌లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో అచ్యుతాపురం జంక్షన్‌లో శుక్రవారం ఆందోళన చేశారు. విద్యుత్ బిల్లులను దహనం చేసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ అధ్యక్షుడు ఆర్.రాము, సభ్యుడు సోమునాయుడు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు చార్జీలను పెంచడం ఏంటని ప్రశ్నించారు. విద్యుత్ మీటర్లతో ప్రీపెయిడ్ చార్జింగ్ చేసుకోకపోతే కరెంట్ ఎప్పుడు పడితే అప్పుడు ఆగిపోతుందని, భారీగా విద్యుత్ బిల్లులకే కేటాయించాల్సిన భయంకర పరిస్థితులు రాబోతున్నాయని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పా రమణ, బి.గణేశ్, డి.శంకర్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ముందు ఆరా.. తర్వాత తస్కరణ!

మునగపాక: చోరీల విషయంలో దొంగలు రోజుకో కొత్త తరహా అవతారం ఎత్తుతున్నారు. మండలంలో ఇటీవల పలు గ్రామాల్లో నాటుకోళ్ల అపహరణకు గురవుతున్నాయి. కోళ్ల యజమానులకు అంతు చిక్కని విధంగా దొంగతనాలు చేస్తూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న సంఘటనలు మునగపాక మండలంలోని చోటు చేసుకుంటున్నాయి. కొంత మంది తాము నాటుకోళ్లను కొనుగోలు చేస్తామంటూ గ్రామాల్లో తిరుగుతున్నారు. కోళ్ల పెంపకం దారులతో బేరం ఆడుతుంటారు.

బేరం కుదరలేదంటూ నెమ్మదిగా అక్కడి నుంచి జారుకుంటారు. తరువాత రోజు ఎక్కడయితే కోళ్లను చూశారో వాటిని గుట్టుచప్పుడు కాకుండా తస్కరిస్తున్నారు. ముందు రోజు నాటుకోళ్లు ఎక్కడున్నాయో ఆరా తీయడం.. వెనువెంటనే రెండు, మూడు రోజుల్లోగా వాటిని ఎత్తుకుపోతున్న సంఘటనలు జరుగుతున్నాయి. దీంతో చేసేది లేక కోళ్ల పెంపకం దారులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మునగపాక, చూచుకొండ, తిమ్మరాజుపేట తదితర గ్రామాల్లో గత కొద్ది రోజులుగా కోళ్ల దొంగతనాలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి.